# సాక్షి
## చిత్తూరు

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025






### రెండు కిలోల గంజాయి స్వాధీనం

బంగారుపాళెం మండలంలో అక్రమంగా తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - IIలో



### ఏనుగుల విధ్వంసం

గంగవరం, పులిచెర్ల మండలాల్లో ఏనుగులు విధ్వంసం సృష్టించాయి. పంట పొలాలను తొక్కి నాశనం చేశాయి. - IIలో



### కూటమిలో గూడుగట్టిన కక్ష!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లపై కూటమి ప్రభుత్వం కక్ష పెంచుకుంది. - IIలో

## న్యూస్‌రీల్

### బోయకొండ హుండీ ఆదాయం రూ.62.67 లక్షలు



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.62.67 లక్షల వరకు వచ్చినట్టు ఈఓ ఏకాంబరం తెలిపారు. శనివారం కానుకలు లెక్కించగా నగదు రూ.62,21,142, బంగారం 72 గ్రాములు, వెండి 705 గ్రాములు సమకూరినట్టు వెల్లడించారు. విదేశీ కరెన్సీ తోపాటు రణభేరి గంగమ్మ ఆలయంలో గల హుండీ ద్వారా రూ.46,310 నగదు లభించిందన్నారు. ఈ ఆదాయం 68 రోజులకు వచ్చినట్లు ఈఓ చెప్పారు. చిత్తూరు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో దయానంద

చిత్తూరు అర్బన్: పలమనేరు నియోజకవర్గానికి చెందిన ఆర్‌జీ.దయానందను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. శనివారం ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

### 30 మందికి అంతర్‌జిల్లా బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేస్తున్న టీచర్లకు శనివారం అంతర్‌జిల్లా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ బదిలీలకు సంబంధించి డీఈవో వరలక్ష్మి పర్యవేక్షణలో చిత్తూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియలో అంతర్‌జిల్లా బదిలీలకు స్పౌజ్ కేటగిరీలో 10 మంది, మ్యూచువల్ కేటగిరీలో 20 మొత్తం 30 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం వారికి అంతర్‌జిల్లా బదిలీల ఉత్తర్వులు అందజేశారు. అదే విధంగా ఇద్దరు ఎంఈవోలకు ఆర్జేడీ కార్యాలయంలో అంతర్‌జిల్లా బదిలీలు నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీచేశారు.

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండాయి. క్యూలైన్ గోగర్భం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,581 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,976 మంది తలనీలాలు అర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో స్వామివారం దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

# నినదిస్తాం.. నిలదీస్తాం!

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దేవళంపేటలో దళితులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నేతల ధర్నా



### దళిత జాతికి అవమానమా.. సిగ్గుసిగ్గు

- వారికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు
- తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు
- దేవళంపేటలో వైఎస్సార్‌సీపీ నేతల ధర్నా
- అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

వెదురుకుప్పం: 'పేదల పక్షాన నిలబడతాం.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టి అమాయకులపై అన్యాయంగా కేసులు పెడితే ఊరుకునేది లేదు' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. దోషులను అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

'దళిత జాతికి ఎక్కడ అవమానం జరిగితే అక్కడ వాలిపోతాం. వారికి అండగా నిలబడతాం. కూటమి పాలనలో దళితులకు సముచిత స్థానం దక్కడం లేదు. వారిని చిన్నచూపు చూడడం.. అవహేళన చేయడం రివాజుగా మారుతోంది. దళితుల దేవుడు, పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను కూల్చడం, పెట్రోలు పోసి నిప్పు పెట్టడం లాంటి వికృత చేష్టలకు పూనుకుంటున్నారు. ఇలాంటి వాటిని సహించేది లేదు. దోషులను వదలి.. మాపై నిందలు వేస్తే ఊరుకునేది లేదు..' అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. వెదురుకుప్పం మండలంలోని దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. బాబాసాహెబ్ విగ్రహానికి నిప్పుపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

#### కేసుల నుంచి తప్పించే కుట్ర

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టిన కూటమి నాయకులను కేసుల నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. దళితుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్‌కు అవమానం జరిగితే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో దేవళంపేటలో సర్పంచ్ గోవిందయ్య అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారని గుర్తుచేశారు. అయితే ఘటన తర్వాత అప్పట్లో వేసిన శిలాఫలకాన్ని తొలగించడం దారుణమన్నారు. న్యాయం చేయాలని ప్రాదేయ పడిన సర్పంచ్ గోవిందయ్యను నిర్బంధించి ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు.

#### ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

దేవళంపేటకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్లప్రసాద్, ఎమ్మెల్యే జగన్‌మోహన్ వచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన ఘటనపై ఆరాతీశారు.

#### కూటమి అరాచకాలకు హద్దుల్లేవ్

చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ విగ్రహాన్ని తగలబెట్టిన వారిని దోషులుగా నిలబెట్టాలని కోరారు. చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అరాచకాలకు హద్దుల్లేవన్నారు. వాళ్లు తప్పులు చేసి ఆ నెపాన్ని తమపై నెడుతూ సునకానందం పొందుతున్నారన్నారు. గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. దళితులనే చులకన భావంతో రెచ్చిపోతూ అవమానవీయంగా ప్రవర్తిస్తున్న టీడీపీ నాయకుడు సతీష్ నాయుడుపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి రామయ్య, బూత్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ పురుషోత్తం, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, నాయకులు నరసింహారెడ్డి, జగదీష్‌రెడ్డి, అమర్నాద్ తోపాటు కార్వేటినగరం, పెనుమూరు, శ్రీరంగరాజపురం మండలాల నాయకులు పాల్గొన్నారు.

### కూటమి నిర్లక్ష్యం.. దళితులకు శాపం



సునీల్‌కుమార్

బంగారుపాళెం: దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహ దహన ఘటనపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దళితుల ఆత్మగౌరవంపై దాడి చేయడమేనన్నారు. ఈ ఘటనను టీడీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటూ పచ్చ పత్రికల మద్దతుతో దళిత సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా నింధితులను పోలీసులు గుర్తించకపోవడం ప్రజల్లో అసహనానికి గురిచేస్తోందన్నారు. దళితుల గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలన్నారు. దళితజాతి మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి ఘటనలను సహించబోమని హెచ్చరించారు.

# కార్యకర్తల బలోపేతమే లక్ష్యం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: పార్టీ కార్యకర్తల బలోపేతానికి కృషి చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పై స్థాయి వరకు అన్ని విభాగాలతో సమన్వయం చేస్తూ పార్టీ క్యాడర్‌ను ఏకతాటిపై తీసుకొచ్చేందుకు పటిష్ట ప్రణాళికలు చేపట్టినట్లు వెల్లడించారు. శనివారం తిరుపతిలో పుంగనూరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, వివిధ మండలాలకు చెందిన వార్డు ఇన్‌చార్జ్‌లు, గ్రామ ఇన్‌చార్జులతో సమావేశాన్ని నిర్వహించారు. వార్డుల వారీగా, గ్రామాల వారీగా నియమించిన ఇన్‌చార్జ్‌లకు పలు సూచనలు, సలహాలు అందించారు. పార్టీ విషయాలతో పాటు కూటమి ప్రభుత్వం వైఫల్యాలు, అరాచకాలు, అక్రమాలపై ఎప్పటికప్పుడు నియోజకవర్గంలోని అందరితో ఒకేసారి చర్చించేలా టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీకి కార్యకర్తలే మూలాధారమని, వారిని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతామన్నారు. తొలిసారిగా పుంగనూరు నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు. కార్యకర్తలు అందరూ సైనికులవలే పని చేస్తూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా కష్టపడాలని కోరారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మాజీ మెంబరు పోకల అశోక్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఐటీ వింగ్ ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, వెంకటరెడ్డి యాదవ్, విరూపాక్షి, జయచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషాతో పాటు ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, నూతన కమిటీల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

# వైద్యుల నిరవధిక సమ్మె




చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పీహెచ్‌సీ వైద్యులు నిరవధిక సమ్మెకు దిగారు. శుక్రవారం రాత్రి ప్రభుత్వంతో పీహెచ్‌సీ వైద్యుల చర్చలు విఫలమయ్యాయి. దీంతో వైద్యులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. శనివారం కూడా సమ్మెను కొనసాగించారు. డిమాండ్లపై గళం విప్పారు.

ఏపీపీహెచ్‌సీడీఏ (ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్) పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు శనివారం కూడా సమ్మెను చేపట్టారు. విధులకు స్వస్తి పలికి చిత్తూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. నల్లరిబ్బన్ ధరించి.. ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఆరోగ్య కేంద్రాలన్నీ కూడా వెలవెలబోయాయి. చికిత్స కోసం వచ్చిన రోగులు డాక్టర్ లేరని ప్రైవేటు ఆస్పత్రుల బాట పట్టారు. అక్కడక్కడా పీజీ వైద్యులు ఉన్న వారి వద్ద చికిత్స పొందేందుకు ఇష్టపడ లేదు. చాలా మంది స్టాఫ్‌నర్సులు, ఆస్పత్రి సిబ్బంది వద్ద మందులు, మాత్రలు తీసుకుని వెళ్లిపోయారు. కాగా శుక్రవారం రాత్రి ప్రభుత్వం, పీహెచ్‌సీ వైద్యుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో రాష్ట్ర కమిటీ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ మేరకు సమ్మెను కొనసాగిస్తున్నట్లు జిల్లా నాయకులు ప్రకటించారు.

#### ఉద్యోగోన్నతి లేకుంటే ఎలా?

ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఉద్యోగోన్నతి లేదని పీహెచ్‌సీ వైద్య జిల్లా సంఘ నాయకులు శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రం ఆమె మీడియాతో మాట్లాడారు. విపత్తులను లెక్క చేయకుండా తాము విధులను నిర్వర్తిస్తున్నామన్నారు. అయినా తమ శ్రమకు తగ్గట్టు ప్రతిఫలం లేదన్నారు. ప్రధానంగా పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులకు ఉద్యోగోన్నతులు లేవన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా సీనియర్ మెడికల్ ఆఫీసర్స్‌గానే మిగిలిపోతున్నామన్నారు. ఈ విషయంలో పీహెచ్‌సీ వైద్యులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. అలాగే పీజీ కోర్సులు చేసేందుకు గతంలో క్లినిక్‌లకు 30 శాతం ఉండేదన్నారు. అయితే ఈ ప్రభుత్వం దాన్ని 15 శాతానికి తగ్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు పలు న్యాయ పరమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.

# దంచికొట్టిన వర్షం

- జిల్లా పలుచోట్ల జోరు వాన
- చెరువులు, వంకలు, వాగుల్లో జలకళ
- పలు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం
- టమాట, కూరగాయలు, వరికి తీవ్ర నష్టం



పెద్దపంజాణి: గడ్డంవారిపల్లి సమీపంలో నీట మునిగిన టమాట పంట

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి వర్షం దంచికొట్టింది. ఉదయం 8 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. పలు చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండుకుని మొరవెత్తాయి. భారీ వర్షం దెబ్బకు పలు మండలాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంటలు సైతం దెబ్బతిన్నాయి.

- పలమనేరు కౌండిన్య నదిలో నీటిమట్టం 8 అడుగులు పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మరింత వర్షం పడితే ప్రవాహం ఉధృతమయ్యే అవకాశాలు ఉన్నట్టు పేర్కొంటున్నారు. కలగటూరు మార్గంలోని చెక్ డ్యామ్ వద్ద వర్షపు నీరు ప్రవహిస్తోంది. అయితే అక్కడ రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేదు. వరినాట్లు పూర్తిగా నీట మునగాయి. టమాట నేల రాలింది. మచ్చ రోగం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు.
- తవణంపల్లిలోని మాధవరం వంక పొంగి పొర్లుతోంది. తొడతర బ్రిడ్జిపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రానికి ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టింది. అలాగే బాహుదానది ప్రవాహంతో కాణిపాకం నుంచి ఉత్తర బ్రహ్మణపల్లి రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. ఎక్కువగా బెంగళూరు నుంచి వచ్చే ప్రయాణికులు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. అయితే ప్రవాహ ఉధృత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో పాటు చిత్తూరు, గుడిపాల, జీడీనెల్లూరు, ఎస్ఆర్‌పురం, గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, పాలసముద్రం, కార్వేటినగరం తదితర మండలాల్లో సైతం కాలువలు, వంకలు, నదులు జలకళను సంతరించుకున్నాయి.

#### కృష్ణాపురం జలాశయం గేట్ల ఎత్తివేత

నగరి : జీడీ నెల్లూరు నియోజకవర్గం, కార్వేటినగరం మండలం, కృష్ణాపురం జలాశయం నిండడంతో శనివారం మధ్యాహ్నం గేట్లు ఎత్తివేసి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేసినట్లు నగరి తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. నగరి మండల కుశస్థలి నది ఒడ్డు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలో 9000299091, 6305312141, 9951777547, 9704623597, 8179399712 సంప్రదించాలన్నారు.



కృష్ణాపురం వద్ద జోరుగా ప్రవహిస్తున్న వాగు



యాదమరి: నుంజర్ల ప్రాజెక్టుకు జల కళ



సోమల: ఉప్పరపల్లి వద్ద గార్గేయ నది ఉధృతి




పెద్దపంజాణి: మొరవ పోతున్న రాయలచెరువు

#### స్తంభించిన జనజీవనం

పుంగనూరు: సోమల మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపిలేని భారీ వర్షం కురవడంతో గార్గేయనది పొంగి పొర్లింది. నీటి ఉధృతికి సోమల మండలంలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. టమాట, వరి, చెరుకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొండల మధ్యన గల గార్గేయ నదిలో నీటి నిల్వలు భారీగా చేరాయి. ఆవులపల్లె, రాయలపేట రోడ్డు పై సుమారు మూడు అడుగుల ఎత్తువరకు నీరు ప్రవహించింది. పెద్దఉప్పరపల్లె నుంచి రాయలపేటకు వెళ్లే రహదారి కోతకు గురైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ముఖద్వారం దెబ్బతింది. మండలంలోని తుగడంవారిపల్లి, వడ్డిపల్లె, పొదల గుంట్లపల్లె, కొత్తూరు ఇర్లపల్లె, పత్రపల్లె, రెడ్డివారిపల్లెతో పాటు పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అన్నిశాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.



సోమల: ఆవులపల్లె రోడ్డులో ప్రవహిస్తున్న గార్గేయనది నీరు



తవణంపల్లె: పొంగుతున్న వాగు



తవణంపల్లిలోని మాధవరం వంక ఉధృతి

## క్లుప్తంగా

### ముగ్గురు యువకులకు గాయాలు



ప్రమాదం జరిగిన స్థలంలో కారు, ద్విచక్ర వాహనం

**కుప్పంరూరల్:** వేగంగా వచ్చి కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తమిళనాడు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన శనివారం ఉదయం కుప్పం మండలం, నాయనూరు అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలు.. తమిళనాడు వాణియంబాడీకి చెందిన మతిన్, సల్మాన్, వసీవుల్లాలు వాణియంబాడీ నుంచి ద్విచక్ర వాహనంలో నాయనూరు మీదుగా కుప్పం వస్తున్నారు. నాయనూరు అటవీ ప్రాంతం దిబ్బరేవు సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఇన్నోవా వాహనం వేగంగా వచ్చి యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదం జరగగానే కారు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదంలో గాయపడ్డ యువకులను కంగుంది పీహెచ్‌సీకి తరలించారు.

### డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్‌లు స్వాధీనం

**పుంగనూరు:** మండలంలోని భీమగానిపల్లె వద్ద చట్టవిరుద్ధంగా డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్‌లు తీసుకెళ్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమగానిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని కురప్పల్లెకి చెందిన మణి, గంగాధర్ కలసి ద్విచక్ర వాహనంలో ఆరు డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్‌లను రాతి గుట్టలు పగులగొట్టేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడ్డారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### డివైడర్‌ను ఢీకొని..

#### ద్విచక్రవాహనదారుడి మృతి



మృతి చెందిన కోదండశెట్టి

**బంగారుపాళెం:** మండలంలోని కేజీ సత్రం వద్ద శనివారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గల డివైడర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పాలసముద్రం మండలం, ఆముదాల గ్రామానికి చెందిన కోదండశెట్టి(54) బెంగళూరులో ఎలక్ట్రీషియన్. నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. సొంత పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై బెంగళూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో కేజీ సత్రం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్‌ను అదుపు తప్పి ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆకలి కేకలు!

- జిల్లాలో 250 చౌకదుకాణాలకు అందని రేషన్ బియ్యం
- పౌరసరఫరాల సంస్థ వద్ద సరఫరా లెక్కలు లేని వైనం
- టెక్నికల్ సమస్యలను సాకుగా చూపుతున్న యంత్రాంగం
- పట్టించుకోని పౌరసరఫరాల సంస్థ అధికారులు



రేషన్‌షాపు వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు (ఫైల్)

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** జిల్లాలో రేషన్ పంపిణీ ఆలస్యమవుతోంది. ఈనెల కోటాలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. ఇంతవరకు పలు షాపులకు సరుకులు చేరలేదు. పౌరసరఫరాల శాఖ, సంస్థ అధికారులు కుంటిసాకులు చెతున్నారు. ఈ క్రమంలో రేషన్ దుకాణదారులు, కార్డుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఆకలితో కడుపు మాడ్చుకుంటున్నారు.

జిల్లాలో 5.40 లక్షల రేషన్‌కార్డులున్నాయి. వీటికి 14 ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సరుకులు సరఫరా అవుతుంటాయి. ప్రతి నెలా 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 3,500 మెట్రిక్ టన్నుల చక్కెర అవసరమవుతోంది. అయితే ఈనెల కావాల్సినంత మేర సరుకు ఎంఎల్‌ఎస్ పాయింట్లకు కేటాయించలేదు. జిల్లాలోని రేషన్ షాపులకు అరకొరగా సరుకులు చేరాయి. జిల్లా వ్యాప్తంగా 1,339 రేషన్ దుకాణాలుంటే దాదాపు 250 షాపులకు పైగా సరుకులు చేరలేదు. దీంతో కార్డుదారులు పస్తులతో కడుపుమాడ్చుకోవాల్సి వస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని కార్డుదారులు వాపోతున్నారు. ఫిర్యాదు చేస్తే..మాకు తెలియదని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఆగ్రహానికి గురవుతున్నట్లు వాపోతున్నారు.

**పట్టించుకునే వారేరి?**

బియ్యం సరఫరా కాలేదని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. 250పైగా షాపులకు సరుకులు చేరలేదని నివేదిస్తున్నా ఏ మాత్రం కదలికలు లేవని ఎంఎల్‌ఎస్ పాయింట్ అధికారులు వాపోతున్నారు. పంపిణీ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని మండిపడుతున్నారు. మరో వైపు షాపులకు సరుకులు సరఫరా చేసిన వివరాలు చూపించడం లేదని అంటున్నారు. ఈ పాస్, ఆన్‌లైన్‌లో తలెత్తిన కారణాల వల్ల కేటాయింపు ఆలస్యమైందని చెప్పుకొస్తున్నారు. 'మాకు ఏం సంబంధం లేదు.. వెళ్లి ప్రభుత్వాన్ని అడగండి' అని దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు వారు ఆగ్రహానికి గురవుతున్నారు.

**మాకేం తెలుసు?**

రేషన్ షాపులకు బియ్యం రాలేదంటే మాకే తెలుసు. వెళ్లి వాళ్లను అడగండి. మా చేతులో ఏముంది. బియ్యం వచ్చాయా... రాలేదా అనే వివరాలు మా దగ్గర లేవు. షాపుల్లో బియ్యం మిగిలి ఉంటాయి. వాటిని ఇస్తారులే. జిల్లాలో 5.4 లక్షల కార్డులుంటే 2.1 లక్షల కార్డుదారులు సరుకులు తీసుకున్నారు. ఇంకా టైం ఉంది. 17వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేస్తారు. ఇప్పటి వరకు సరుకులు రాలేదంటే ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. – **శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు**

# డ్యూటీకి డుమ్మా!

- ఆరోగ్య ఉపకేంద్రాల్లో సమయపాలన పాటించని సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



మధ్యాహ్నానికే మూతపడిన కార్వేటినగరం ఆరోగ్య ఉపకేంద్రం

**కార్వేటినగరం:** మండలంలో ఆరోగ్య సిబ్బంది తీరు రోజురోజుకూ తీసికట్టుగా మారుతోంది. డ్యూటీలకు డుమ్మా కొడుతూ రోగులను ముప్పుతిప్పలు పెడుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడంతోనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది.

**మధ్యాహ్నానికే మూత**

జీడీనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం మేజర్ పంచాయతీలో మూడు సచివాలయాలు, మూడు ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. అందులో ముగ్గురు ఏఎన్‌ఎంలు, ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీలు విధుల్లో ఉన్నారు. వారు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలి. కానీ సిబ్బంది 3 గంటలకే తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు ముప్పుతిప్పలు పడుతున్నారు. ఉదయం 9 గంటలకు హాజరు కావాల్సి ఉండగా.. 10 గంటల వరకు డ్యూటీకి రావడం లేదు. కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లతో పాటు ఇద్దరు పర్యవేక్షకులు, ఒక సీహెచ్‌ఓ, సీహెచ్‌ఎన్ ఉన్నప్పటికీ సబ్‌సెంటర్లపై తనిఖీలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. శనివారం కార్వేటినగరం సబ్‌సెంటర్ 2.45 గంటలకే తాళాలు వేసి ఉండడంతో రోగులు వచ్చి నిరాశతో వెనుదిరగడం కనిపించింది.

**మందుబిళ్లలూ కరువే**

కార్వేటినగరం మేజర్ పంచాయతీ పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో జ్వరం, దగ్గు, జలుబు లాంటి వాటికి కూడా మందుబిళ్లలు, స్విరప్‌లు, ఇంజక్షన్లు ఉండడం లేదన్న విమర్శలున్నాయి. ఒకవేళ రోగులు వెళ్లి అడిగినా 'మందుల్లేవ్' అంటూ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

**చర్యలు తీసుకుంటా**



వైద్య సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ చేయాలి. ఏదైన సర్వేలు ఉన్నప్పటికీ ఒక్కరైనా అందుబాటులో ఉండాలి. సాయంత్రం నాలుగు గంటల వరకు ఎలాంటి పరిస్థితుల్లో కూడా ఆరోగ్య ఉప కేంద్రానికి తాళాలు వేయకూడదు. విచారణ చేపడుతాం. సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటా.

**డాక్టర్ హేమశ్రీ, కత్తెరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి, కార్వేటినగరం మండలం**

# డీఎంహెచ్‌వో ఆదేశాలు బేఖాతర్



రెండు రోజుల క్రితం డీఎంహెచ్‌వో సీజ్‌చేసిన పీఎంపీ క్లినిక్ ఇదే



అదే క్లినిక్ వైనుక వైపు దర్జాగా ప్రాక్టీస్ చేస్తున్న అదే పీఎంపీ

**పలమనేరు:** పలమనేరులో పీఎంపీలు డీఎంహెచ్‌ఓ బేఖాతర్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే వార్నింగ్ ఇచ్చి వెళ్లినా మళ్లీ సూదులేయడం, మాత్రలు ఇవ్వడం ప్రారంభించారు. మీరు క్లినిక్‌ను సీజ్ చేస్తే మా ప్లాన్ మాకుంటుందంటూ నిరూపిస్తున్నారు. ఇలాంటి ఘటనే శనివారం వెలుగు చూసింది. స్థానిక ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న టీఎస్ రామచంద్రన్ పీఎంపీ క్లినిక్‌ను శుక్రవారం డీఎంహెచ్‌వో సుధారాణి దాడులు చేసి సీజ్ చేశారు. ఆమె ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఆ పీఎంపీ ముందు సీజ్‌చేసిన క్లినిక్ ఉంటే వెనుకవైపు రహస్యంగా మళ్లీ ట్రీట్‌మెంట్ చేయడం ప్రారంభించాడు. దీంతో పట్టణంలోని మిగిలిన పీఎంపీలు సైతం ఏ ధైర్యంతో ఆయన మళ్లీ ప్రాక్టీస్ చేస్తున్నాడంటూ విస్తుపోతున్నారు. ఆ పీఎంపీకి పట్టణానికి చెందిన ఓ అధికార పార్టీ నేత అండదండలున్నందునే మళ్లీ ప్రాక్టీస్ మొదలు పెట్టాడనే మాట వినిపిస్తోంది. దీనిపై డీఎంహెచ్‌వో ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

# రక్త పరీక్షలు విధిగా చేపట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ విధిగా రక్త పరీక్షలు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో శనివారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో జ్వరాల కేసులు అధికమయ్యాయని, వర్షాల కారణంగా విష జ్వరాలు పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో ల్యాబ్ టెక్నీషియన్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విధులకు డుమ్మా కొడితే తదుపరి చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంత రావు, డీపీఎంఓ ప్రవీణ పాల్గొన్నారు.

# ఉద్యోగోన్నతులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డీఈవో పూల్‌లో ఉన్న 166 మందికి ఉద్యోగోన్నతులు కల్పించడం హర్షణీయమని ఎస్‌ఎల్‌టీఏ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దొడ్డా ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 నుంచి భాషా పండితులు ఉన్నతీకరణ ఉద్యోగోన్నతుల్లో ఎస్జీటీలకు స్థానం కల్పించడంతో డీఈవో పూల్‌లో ఉండిపోయారన్నారు. స్థిరమైన చోటు లేక, సుదీర్ఘకాలంగా ఉద్యోగోన్నతులు లభించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగు 123, హిందీ 34, ఉర్దూ 2, తమిళం 6, సంస్కృతం 1 మొత్తం 166 మందిని డీఈవో పూల్ నుంచి తొలగించి ఉద్యోగోన్నతులు కల్పించడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు.

# 'అల్లుకున్న' నిర్లక్ష్యం



గుడిపాల మండలంలోని గొల్లమడుగు గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దిమ్మె చుట్టూ తీగలు, ముళ్ల పొదలు అల్లుకుపోయాయి. అలువైపు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆదమరిస్తే అంతే సంగతులు. పెను ప్రమాదం ముంచుకురాకముందే ట్రాన్స్‌కో అధికారులు మేల్కొనాల్సి ఉంది. – **గుడిపాల**

# ఎవరు చోరీ చేశారో చెప్పేయండి!

- రాజనాలబండకు చేరిన ముత్తుకూరు చోరీ ఘటన



రాజనాలబండపై ముత్తుకూరు గ్రామస్తులను విచారిస్తున్న అర్చకులు

**చౌడేపల్లె:** పెద్ద పంజాణి మండలం, ముత్తుకూరులోని ఓ ఇంట్లో జరిగిన చోరీ వ్యవహారం శనివారం రాజనాలబండ అభయాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరింది. బాధితురాలి కథనం.. ముత్తుకూరుకు చెందిన లింగప్పగారి రెడ్డెమ్మ గత నెల 12న తన కుమార్తె ఉన్న పెద్దారికుంటకు వెళ్లింది. బీరువాలోని నగలు, నగదు భద్రపరచి తాళాలు మంచం పరుపు కింద దాచి బండ్లమిద్దికి తాళం వేసి వెళ్లింది. వారం రోజుల పాటు అక్కడే ఉండిపోయింది. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు కిటికీ మార్గం గుండా ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన 20 గ్రాముల బంగారు, రూ.1.5 లక్షల నగదును చోరీ చేశారు. ఈనెల 18న ఇంటికొచ్చిన రెడ్డెమ్మ తాళాలు తీసి ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువాలోని నగదు కనపడక పోవడంతో చుట్టు పక్కల విచారించింది. ఆపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంగా గ్రామంలోని ఇంటికొక మనిషితో సత్యప్రమాణాలు చేసేందుకు శనివారం రాజనాలబండకు చేరుకున్నారు. అక్కడ గ్రామస్తులతో అర్చకులు కృష్ణమూర్తి వేర్వేరుగా విచారణ జరిపి ఈ నెల 11కు వాయిదా వేశారు. ఆ రోజు గ్రామస్తులు రాజనాలబండకు రావాలని తీర్మానించారు.

# ఏనుగుల విధ్వంసం

**గంగవరం:** మండల పరిధిలోని మొసలిమడుగు గ్రామ సమీప పొలాలపై శుక్రవారం రాత్రి ఏనుగులు చొరబడి విధ్వంసం సృష్టించారు. బండమీద గ్రామానికి చెందిన వ్యవసాయ భూమి వద్ద నివాసం ఉంటున్న మహిళా రైతు కవిత ఇంట్లోకి రాత్రి 11గంటల సమయంలో రెండు ఏనుగులు చొరబడ్డాయి. ఆ సమయంలో ఏనుగులను గుర్తించి మహిళ, ఆమె పిల్లలు పెద్దగా కేకలు వేసుకుంటూ గ్రామంలోకి పరుగులు తీశారు. నిత్యం ఇలా నరకం అనుభవిస్తున్నామని, అటవీశాఖ అధికారులు వెంటనే ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**పంట పొలాలపై ఏనుగుల దాడి**

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలో ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. తాజాగా మండలంలోని సైదుల్లా గుట్ట, కోటపల్లె పాళెం ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున ఏనుగుల మంద పంటలపై పడి సాజహాన్ మామిడి చెట్లను, హరికి చెందిన వరి పొలాన్ని తొక్కిపడేశాయి. మామిడి కొమ్మలను విరిచేశాయి.

# రెండు కిలోల గంజాయి స్వాధీనం

**బంగారుపాళెం:** మండలంలోని కొత్తపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురుని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు బంగారుపాళెం–అరగొండ రహదారి కొత్తపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆరుగురు వ్యక్తులను విచారించి, వారివద్ద ఉన్న కవర్లను పరిశీలించారు. అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 2 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న తవణంపల్లె మండలం, గోవిందరెడ్డిపల్లెకు చెందిన మాధవ, ఐరాల మండలం, గండ్లపల్లె ఎస్టీ కాలనీకి చెందిన నరసింహులు, బంగారుపాళెం మండలం టి మిట్టూరుకు చెందిన విగ్నేష్, సదకుప్పంకు చెందిన హరీష్, తవణంపల్లె మండలం, ఈచనేరికి చెందిన జీవ, బంగారుపాళెం మండలం, నల్లంగాడు గ్రామానికి చెందిన కబిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిత్తూరు పట్టణం ఇరువారం గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు అల్లాబక్ష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

# కూటమిలో గూడుగట్టిన కక్ష!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లపై కూటమి సర్కారు కక్ష పెంచుకుంది. వివిధ దశల్లో ఆగిన గృహాలకు సక్రమంగా బిల్లులందించకుండా వేధిస్తోంది. వసతి లేక పనులు ప్రారంభించని వారిని లబ్ధిదారుల జాబితా నుంచి పూర్తిగా తొలగించింది. నిరుపేదల సొంతింటి కలను శాశ్వతంగా దూరం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. చేతనైతే సాయం చేయాల్సింది పోయి.. 1,624 గృహాలను రద్దు చేసేసింది. ఎప్పటికైనా తమదైన గూడులో నివసించవచ్చని ఆశించిన బడుగులపై ఆకాంక్షలను పిడుగుపాటుకు గురిచేసింది.

- పేదల ఇళ్లపై పిడుగు
- కట్టలేదని 1,624 నివాసాల రద్దు
- ఇప్పటి వరకు ఒక్క ఇంటిని కూడా మంజూరు చేయని ప్రభుత్వం
- జిల్లాలో నిలిచిపోయిన పక్కాగృహాల నిర్మాణ పనులు



పలమనేరు మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డి లేఅవుట్‌లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

**పలమనేరు :** పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 609 జగనన్న లేఅవుట్లలో 77,365 పక్కా ఇళ్లను మంజూరు చేసింది. అందులో 46,163 వేల గృహాల నిర్మాణం పూర్తి చేయించింది. 31,203 ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రణాళిక మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6,719 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉండగా కేవలం 2,389మాత్రమే పూర్తయ్యాయి. ఇప్పటికీ 4,330 గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఆగింది. వాటిలో ఇప్పటికీ పనులు ప్రారంభించి 1,624 ఇళ్లకు మ్యాపింగ్ , జియోట్యాగింగ్ లేదని కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్‌లో తొలగించింది. గత ప్రభుత్వంలో వీటి నిర్మాణాలకోసం రూ.వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేశారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. బిల్లులను తప్పనిసరిగా చెల్లిస్తామని హౌసింగ్ అధికారులు చెబుతున్నప్పటికీ లబ్ధిదారులు పనులు చేపట్టేందుకు ధైర్యం చేయడంల లేదు. ఈ నేపథ్యంలో నిర్మాణం ప్రారంభించని ఇళ్లను ప్రభుత్వం రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కొత్తవాటి ఊసేలేదు..**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వాటికంటే అధికంగా ఇళ్లను నిర్మిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఊదరగొట్టారు. తీరా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు సమీపిస్తున్నా ఇప్పటి వరకు ఒక్క ఇంటికి కూడా పునాది వేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే జిల్లాలో పంచాయతీలవారీగా పక్కా ఇళ్లకు పలువురు నేతలు అర్జీలు తీసుకున్నారు. కేవలం కూటమి కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేయించేలా హౌసింగ్ అధికారులకు వాటిని పంపారు. ఈ మేరకు జిల్లాలో సుమారు 30వేల మందిని లబ్ధిదారులుగా చేర్చారు. కానీ ఇప్పటి దాకా ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు కాకపోవడం గమనార్హం. ఈ క్రమంలో ఇళ్ల రద్దుపై హౌసింగ్‌శాఖ అధికారులనే సంప్రదిస్తే ప్రభుత్వ పాలసీని తాను అమలు చేయాల్సిందనే చెబుతున్నారు. దీనిపై జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు మేనేజర్ సుబ్రమణ్యాన్ని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 1,624 ఇళ్లను రద్దు చేసింది వాస్తవమేనని స్పష్టం చేశారు.